# సుందరాయణం

ఆఫీసులో హడావుడి అంతా ఇంతాగాదు.

మానేజర్ నుండి ప్యూన్ వరకు ...ముఖాల నిండా- సీరి యస్‌నెస్ పులుముకుని పంజేస్తున్నారు.

గుమాస్తాల గుసగుసలు టైపిస్టుల టకటకల్లో కరిగి పోతున్నై. కళ్ళు, చేతులు ఫైళ్ళమీదున్నా... చెవులు, మనస్సు లు మాత్రం ఎంక్వైరీ గది చుట్టూ తచ్చాడుతున్నవి. ఒక సెక్షన్ ఫైలును ఇంకో సెక్షనుకు చేర్చాలన్నా ...మరేం పని పురమా యించినా—ఎంక్వయిరీ రూమును చేస్తున్నాయి అటెండర్ల నబడే మేఘదూతల అడుగులు. తాము విన్నంత, చెప్పగలిగి నంత సమాచారం 'కాళిదాసు కవిత్వానికి తమపైత్యాన్ని' జోడించి... సమాచారమంతా చేరవేస్తున్నారు గుమస్తాలకు.

'తింటె గారెలే తినాలి... వింటే ఎంక్వయిరీ సమాచారమే వినాలి' అంటూ చెవ్విఖ్యారుతున్నారు. - మారుమూల నున్న జూనియర్ మోస్ట్ గుమాస్తాలుగూడా చెవుల్ని అటెండర్ల కప్పగించి నామమాత్రంగా కాయితాల్ని తిరగేస్తున్నాడు.

* * * * * * *

"వాళ్ళిద్దరు దెబ్బలాడుకుతున్న రోజు మీరాఫీసులో వున్నా రా?" ఎంక్వయిరీ ఆఫీసర్ ప్రశ్నించాడు గంభీరంగా... సీనియర్ మోస్ట్ యు.డి.సి. సుందరంను.

గాలిని కట్టివడేసిన ఎయిర్ కండిషన్ రూమది - నిశ్శబ్దానికి కొదవలేదు.

"ఉన్నాను సార్...!" అతి వినయంగా జవాబిచ్చింది సుందరం విధేయత... తమాయించుకుని కూర్చుంటూ.

చకచకా సాగిపోతూ తెల్ల కాయితాల్ని నల్ల జేస్తుంది. ఎంక్వయిరీ ఆఫీసర్‌గారి కలం ...హుషారైన రైతు-అతిహుషారైన ఎద్దుల్తో-బంజరు భూమిని దున్నుతున్న నాగలిలా.

"ఆరోజేం జరిగింది?" కళ్ళద్దాల్లోంచి చూస్తూ ప్రశ్నించాడు.... ఆఫీసర్.

"అలవాటు ప్రకారం ఆరోజుగూడా పదిగంటలకే ఆఫీసుకొచ్చాను. అటెండెన్సు రిజిష్టర్లో సంతకంచేస్తూ.... మానేజర్ గారూ, డిప్యూటీ మానేజర్ గారలు-ఏదో చిరుబురులాడు కోవడం గమనించాను. నాకెందుకా విషయాలనుకుని.... సెక్షను కెళ్ళిపోయానండి. ఆ తర్వాత....కొంచెం సేపటికి ముఖ్యమైన ఫైలొకటి తీసికొని మానేజర్‌గారి వద్దకెళ్ళానండి సంతకం కొరకు...."

"ఎన్ని గంటలకు?...." కలానికొక సెకండు విశ్రాంతి దొరికింది.

తన వాగ్ధాటినాపి "సుమారు... పదకొండున్నరా-పన్నెండు మధ్యండి...." తాపీగా వచ్చేస్తుంది వాగ్మూలం

"ఆ తర్వాత...."

"అప్పటికే ఏవో మాటలు గట్టిగా అంటున్నారండి మానేజర్ గారు - డెప్యూటీ మానేజర్ గార్ని.... కోపంతో...."

" ఏం మాటలంటున్నారు?"

"....' నువ్వు రాసిందానికల్లా నేను కళ్ళు మూసుకు సంతకాలు చెయ్యాలా? ఈ ఆఫీసు మొత్తానికి అధికారిని నేను.... నువ్వు నా సబార్డినేటు వన్న సంగతి మరువగూడదు మిస్టర్! ఏ కాయితం పైనన్నా.... నా ఇష్టముంటే.... నాకు సంతృప్తి కలిగితేనే సంతకం చేస్తాను - లేకపోతే లేదు. నీ లిమిట్స్ దాటితే మర్యాద దక్కదు-తెలుసా?.... అని. ఇంకా ఏమేమో అన్నారండి..."

" ఆ తర్వాత....! "

".... నువ్వు నీ ఇష్టమొచ్చినట్టు చేస్తుంటే.... చూస్తూ ఊరుకునే దద్దమ్మను గాన్నేను. నేను.... నీ కస్టోడియన్ వన్న మాట మరువద్దు. ఎస్టాబ్లిష్ మెంటంతా నాకొప్పజెప్పి ... మాటి మాటికి పేచీలు పెడతా వెందుకు? కాసింత అడ్మిని స్ట్రేషన్ పవర్ నాగ్గూడాలేదా? సింపుల్ .... ఒక గుమాస్తాకు లీవు గ్రాంటు చేయాలన్నా నీ బోడి సలహా అడగాలా? నాకామాత్రం అధికారం లేక పోతే .. ఆ సెక్షన్ను గూడా నువ్వే డీల్‌చెయ్. లీవుగ్రాంటింగులో గానీ గుమాస్తాల సెక్షన్లు మార్చడంలో గానీ, మరిదేంట్లోగాని నేనేమన్నా లాలూచే పడితే.... నామీద హెడ్డాఫీసుకు రిపోర్టు చేసే డ్యూటీ నీది.... అంతేగాని చీటికి-మాటికి అడ్డువస్తే- మర్యాద దక్కదు.... అంటూ ఇంకా ఏమేమో అనుకొ

చ్చారండి. డిప్యూటీ మానేజర్ గారు—మానేజర్ గార్ని" ఇంకా స్త సర్దుకూర్చుకున్నాడు సుందరం.

"ఆతర్వాతేం జరిగింది....? కొంచెం ముందుకు వంగింది ఆఫీసర్ తలకాయ.

"ఒకరినొకరు పూల్, రాస్కెల్... ఇంకా ఏవేవో అసభ్య కరమైన మాటలనుకుని... ఒకరిపై నొకరు చేయిచేసు కోవడం గూడా జరిగిపోయిందడి!.... మేము గనక సమయానికి అడ్డు కొకపోతే... ఆఫీసులో రామ, రావణ యుద్ధం జరిగిపోయే దండి...." లేవబోయి కూచున్నాడు స్ప్రింగ్‌లా.

"ముందు .... ఎవరిపై ఎవరు చేయిచేసుకున్నారు?" రాసుకుంటూనే అడిగాడు.

"ముందు మానేజర్‌గారు.... డెప్యూటీ మానేజర్‌గార్ని చెంప దెబ్బ కొట్టారండి... ఆ తర్వాత...."

"ఇహచాలు.... మీరు వెళ్ళొచ్చు" వంచిన తల ఎత్త కుండా చెప్పేసాడు.

ఇంకాస్సేపు చెబుదామనుకున్న సుందరం తక్కున నోర్మూసుకుని బయటపడ్డాడు.

నెక్ట్స్ సీనియర్ గుమాస్తా భుజంగరావు నమ స్కారంతో ప్రవేశించాడు. ఓ చెంప కూచొమ్మని కళ్ళతో సైగచేస్తూనే మరో చెంప

"మానేజర్... డిప్యూటీమానేజర్ గారల గలభా రోజున మీరాఫీసులో ఉన్నారా?" సూటిగా ప్రశ్నించాడు ఎంక్వయిరీ ఆఫీసర్.

"ఉండకుంటే నేనెక్కడ చచ్చాను....?" మనసులోనే అనుకుని... పైకిమాత్రం వినయం ప్రదర్శిస్తూ

"డెప్యూటీ మానేజర్‌గారు తమ హద్దుల్లో ఉంటారండి...." అన్నాడు పూర్తిగా కూర్చుండి.

"అది.... మీకెలా తెలుసు?" నువ్వు నీ హద్దులుదాటుతున్నా, వన్నట్టుగన్పించింది ప్రశ్నాబాణం.

'అయ్యో!... చాలా కేసులున్నాయండి! మన ఇన్ఫర్మేషన్ క్లార్కుకు ఎర్నడ్ లీవు సాంక్షన్‌చేసి.... కనీసం.... మానేజర్ గారి దృష్టికన్నా తేలేదు. తానే ఫార్ మానేజర్ సంతకంతో సాంక్షన్ చేసేసారు ఏమన్నా అంటే.... ఆసెక్షనంతా హెడ్డాఫీసు వాళ్ళు నన్నే చూసుకొమ్మన్నారంటారండి! ఔటువార్డు గుమస్తా త్యాగరాజు గార్ని ఎస్టాబ్లిష్ మెంటు సెక్షన్‌కు మార్చారండి. అందులో ...... ఏదో ...... లాలూచి పడి వుంటారనే మానమ్మకం సార్!...."

"లాలూచా!.... ఆఁ ఇంకా...." తల పైకెత్తి కళ్ళజోడు సవరించుకున్నాడు.

"ఆఫీసు ఫర్నిచర్ కొరకు తమ ఫావరైట్ కంట్రాక్టర్ ఎస్టిమేట్సు.... అప్రూవల్ కొరకు హెడ్డాఫీసుకు పంపిస్తూ-ఆ లెటర్ను ఫైళ్ళమధ్య ఇరికించి.... మానేజర్‌గార్కి తెలీకుండానే వారి సంతకం చేయించారండి....!" గుండెలు బాదుకున్నంత పంజేసాడు.

"సరే.... ! ఆ రోజు.... ఎవరిని ఎవరు ముందు

కొట్టారు? ...." నీ వాగ్ధాటికి నేనేం బెదిరిపోనులే నన్నట్టుగా ఉన్నాయి, ఆఫీసరు చూపులు.

"ముందు.... డెప్యూటి మానేజరు గారు.... మానేజర్ గార్ని కొట్టారండి చెంపమీద" తన చెంప నిమురుకున్నాడు భుజంగరావు.

"ఇకమీరు వెళ్ళొచ్చు"

భుజంగరావు బయట పడ్డాడు చెమటలు తుడుచుకుంటూ. అంచలంచలుగా మానేజర్, డిప్యూటీ మానేజర్, ఇంకిద్దరు గుమాస్తాల స్టేటుమెంట్సుగూడా పూర్తయినాయి

ఇంత కమామీషు జరగడానికి తెరవెనుక.... అంతకు ముందటి సంఘటలే జీవము.

* * * * * * *

"గుడీవినింగ్ సార్ ... !"

"గుడీవినింగ్.... రండి, రండి!. ఏమిటీ విశేషాలు? ఈ రోజు ఆఫీసంతా ప్రశాంతంగానే ఉంది గదా!" ఇంటికి వచ్చిన వాళ్ళను కూచోబెట్టి ప్రశ్నించారు - డెప్యూటి మానేజర్ గారు మందహాసం చేస్తూ

"ప్రశాంతతకేం లెండి?.... గంగమ్మ మెత్తనిదే కాని గట్లను కోసేస్తుందన్న సత్యం మీకు వేరుగా చెప్పాల్సిన అవసరం లేదనుకుంటా...." సుందరం మాట పూర్తికాకుండానే. నలుగు రైదుగురు గుమాస్తాలు వచ్చేసారు బిలబిలమంటూ.

"ఇది సాళిల్లా... లేక ఆఫీసా?" అన్న అనుమానంరాక పోలేదు డిప్యూటీ మానేజర్‌కు.

"ఆరెరె... అంతా వచ్చేసారే ... ఐదుగంటలదాకా ఆఫీసులో ఉన్నాంగదా .... .... ఆశ్చర్యంలో ఆందోళన తొంగి చూచింది.

"ఏదో! ... మీ విషయమే .... మాకు తోచిన విషయాలు .... మేం గమనించినవి మీకు చెబుదామనీ .... " పసిగాడు సుందరం వినయ విధేయత లొలకబోస్తూ. మిగతా వారంతా అతని సలహా మేరకే వచ్చారని చెబుతున్నాయి .... వాళ్ళ కళ్ళ ల్లోకి సుందరం విసిరిన చూపులు.

" ... ఓహో! .... మానేజర్ గారి గొడవంటారా? .... ఏదో ... చత్రికా నాం గాడి ... " అన్నాడు ఆ గొడవ ఇప్పుడెందుకన్నట్లుగా.

"అదెలాగండి? మీ పరిస్థితి చూస్తే మాకే అదోలా అనిపిస్తుంది .... ఎంత మానేజరైతే మాత్రం మీరు చేసే ప్రతి పనికి అడ్డు తగలాలా పానకంలో పుడకలా? వారిని కన్సల్ట్ చేయకుండా మీరీ రోజు త్యాగరాజును ఎస్టాబ్లిష్‌మెంటు సెక్షనుకు మార్చారని నలుగురికీ చెబుతూ రుసరుసలాడ్డమెందుకు? స్టాఫ్ విషయాలు మీరే చూడాలని హెడ్డాఫీసు ఇనస్ట్రక్షన్స్ ఉండగా మీరతన్నెందుకు కన్సల్ట్ చేయాలి ... ? పోనీ .... ఏదో మాటవరసకని ఊరుకున్నాడా? లేదు .... డప్పు పట్టుకుని చాటించేశాడు ఆఫీసంతా. అబ్బబ్బ .... మాకైతే ఇలాంటి విషయాలు నచ్చవండి...." సుందరం అభిప్రాయం పూస గుచ్చినట్టు వెల్లడైంది.

''అవున్సార్? మీకు తెలీదు గానీ... రోజూ మీరు చేసే ప్రతి పనిలో ఆయన జోక్యం చేసుకుని .... స్టాఫ్ ముందు మీ మీద చెడు అభిప్రాయం కలిగేట్టు మాట్లాడుతాడు .... ఇప్పటికే మీమీద కొందరి అభిప్రాయం మారిపోయింది గూడాను ...." గుంభనంగా వుండే గుమాస్తా రామనాథం నోటి నుండి వచ్చిన మాటలవి.

గుమాస్తాలతో ఇద్దరు పురప్రముఖులు వచ్చారు. అందులో రాజేశ్వరొకడు.

"నిజంగా నేనెన్నోసార్లు విన్నాను బయట మార్కెట్టులో మీ ఆఫీసు విషయాలు ... ఊళ్లో ఆడవాళ్లకు గూడా మీ ఆఫీసు విషయాలే కబుర్లై కూచున్నై సార్! మీరు రెకమెండు చేసే ప్రతి కంట్రాక్టుకూ ఎంతో కొంత జేబు నింపుకుంటారంటున్నారండీ! మీరైతే అలాంటి వారుకారు .... నిప్పులాంటివారు. కాని మీరెందుకిలా అన్యాయంగా బజారుపాలౌతున్నారో అర్థంగావడం లేదండీ" తాను చెప్పాల్సిన విషయాల్ని చెప్పి చక్కా వెళ్ళిపోయాడు బయటకు.

"ఇదంతా ఆ మానేజర్ మహాశయుని పనే అనవసరంగా మీమీద నిందలు మోపి హెడ్డాఫీసువాళ్ళ నోటీసుకు తేవాలని పన్నాగం. దీంతో ఆయన బావుకునే దేముందోగాని....ఎందుకిలా ప్రవర్తిస్తున్నారో అర్థం గావడం లేదు ....'' విచారం వెలిబుచ్చాడు సీనియర్ గుమాస్తా రాజశేఖరం.

''ఎందుకా?.... డెప్యూటీ మానేజర్ గార్ని ట్రాన్సఫర్ చేయించి వేరే ఓ దద్దమ్మను వేయించుకుంటె ఆయన గారి

కెమరుండదని ప్లాను ...'' బ్రిహ్మరహస్యమిది అనే ధోరణిలో చెప్పేసాడు మరో గుమాస్తా.

అంతలోకే వచ్చిన కాఫీ కప్పులందు కున్నారంతా.

"నిజమే అయ్యుంటుంది...'' గొణిగింది డెప్యూటీ మానేజర్ గొంతు కాఫీ సిప్‌చేస్తూ.

గబగబా కాఫీ కప్పు ఖాళీచేసి

"అయ్యుంటుందేమీటిసార్.... ఖచ్చితంగా అంతే. ఐనా.... రోజూచచ్చేవాడికి ఏడ్చేదెట్లాసార్? .... ఇదేదో తేల్చేసుకోవాల్సిందే! ఏదో.... మీరంటే అభిమానం గాబట్టి... అన్యాయం ఆలా వెర్రితలలు వేస్తుంటే సహించలేక - మా అభిప్రాయాల్ని మాలోనే నిక్షిప్తం చేసుకోక మీకు విన్నవించుకుందామని వచ్చాం సార్!" చల్లకొచ్చిముంత దాచడమెందుకుని అసలు విషయం కక్కేసాడు సుందరం.

డెప్యూటీ మానేజర్ గారి కేమీ పాలుపోలేదు. వచ్చిన వారంతా ఎవరిదారి వారు చూచుకుంటున్నారు - గుడ్‌నైట్ చెప్పుకుంటూ. నుదుటిమీది చెమట బిందువుల్ని గమనించే పరిస్థితిలోగూడా లేడు.

* * * * * * *

మానేజర్ గారింట్లో........

"నమస్కారం" తో పత్యక్షమైంది భుజంగరావు బృందం.

తుళ్ళిపడ్డ మానేజర్

"అరెరే.... ఏమిటీ ఇందరికీ ఒకేసారి దయకల్గిందేమిటీ నామీద...." అన్నాడు కుర్చీలు చూపిస్తూ. అప్పటికే తయారై కూచున్నాడు ఫ్యామిలీతో సినిమా కెళ్ళాలని "స్వర్గానికెళ్ళినా సవతి పోరు తప్పదా?" అనుకున్నాడు మనసులో - పానకంలో పుడకల్ని కలియజూస్తూ.

" మీతో.... కొంచెం మాట్లాడాలి ...." నసిగాడు భుజంగరావు.

"కొంపదీసి నమ్మి చెప్తారేమో...." అనుమానపడింది మానేజర్ మనసు,

"దాందేముంది.... చెప్పండి" అన్నాడు భావాలు బయిటికి రాకుండా.

ముచ్చెమటల్ని చేతిగుడ్డతో తుడుచుకుంటూంటే

"నాన్నా .... మరి సినిమానో?" బుంగమూతి పెట్టాడు మానేజర్ పుత్రరత్నం,

భుజంగరావు మొహంలోకి చూచాడు మానేజర్ సమాధానమేం చెప్పాలని.

ఈ రోజుకు వాళ్ళను వెళ్ళమనండి సార్! మీ ప్రోగ్రాం కడ్డు వస్తున్నందుకు.... క్షమించాలి...." మనం మాట్లాడి తీరాల్సిందే నన్న ధోరణితో సలహాయిచ్చాడు భుజంగరావు సవినయంగా.

ఇంట్లోకెళ్ళి భార్యా పిల్లల్ని వెళ్ళమని చెప్పి "ఇప్పుడు చెప్పండి" అంటూ కూర్చున్నాడు.

" ఏంలేదండి ........ మన డెప్యూటీ మానేజర్ గారి వ్యవహారం ... రాను రాను మితిమీరుతుందేమోనని ........ " ప్రారంభించాడు భుజంగరావు పేటెంట్ దోస్త్ కాళిందిరావు.

"అబ్బ .... అంటే ... మీరేమంటున్నారు?" సరిగా అర్థం కాలేదు మానేజర్‌కు.

"అదేనండి .... ప్రతిపనిలో మన డెప్యూటీ మానేజర్‌గారు మమ్మల్ని కేర్ చెయ్యకుండా .... ఇష్టమొచ్చినట్టు వ్యవహరిస్తున్న సంగతి మీక్కూడా తెలుసుగదా!" తిరిగి వివరించాడు కాళిందిరావు.

"దాందేముంది? హెడ్డాఫీసు వాళ్ళాయన్ను ఇండిపెండెంటుగా వ్యవహరించుకోవచ్చని ఒప్పజెప్పిన సెక్షన్‌లను ఆయనే డీల్ చేస్తున్నాడు .... కొంచెం కష్టమన్పించినా బాధపడొద్దు గదా!" అన్నాడు మానేజర్-సమ్మె సంగతికాదని రూఢిచేసుకుని.

"ఐతే ఈమార్పులు, చేర్పులు .... మిమ్మల్ని గూడా ఖాతరు చెయ్యకపోవడం .... మీకళ్ళుగప్పి మీసంతకాలతోనే కాంట్రాక్టులు హెడ్డాఫీసుకు రెకమెండు చెయ్యడం ... ఇండిపెడెంట్ పవర్సున్నగదాని కాకర కాయని గుమాస్తాలతో లాలూచీ పడ్డం .... తనిష్టమొచ్చినట్టు సెక్షన్లు మార్చడం ... ఇదంతా మీకు న్యాయమన్పిస్తే ... మాకే మభ్యంతరంలేస్సార్!" ఊపిరి పీల్చుకున్నాడు భుజంగరావు.

"ఐతే .... ఆయన మితిమీరుతున్నాడన్న మాట .... " అసలు సంగతి అర్థమైపోయింది మానేజర్‌కు. తేరిన్చి కుర్చీలో వాలిపోయాడు వెనక్కు.

అంతలోకే అందుకున్నాడు ఛోటా కంట్రాక్టర్ శేషావతారం "అన్నమాటేమిటిసార్... ఉన్నమాటే! ఆఫీసులో మీ పప్పులేమీ ఉడకడంలేదనీ .... మీకలంలోని కరకుదనం మాయమైందనీ ... అసలు మీరు నామకార్థమేననీ .... వ్యవహారమంతా డెప్యూటీ గారిదేననీ... నలుగురు నాల్గు రకాలుగా చెప్పుకుంటూంటే వినలేక పోతున్నాంసార్?"

మానేజర్ మొహాన్ని నీలినీడలు అలుముకున్నాయి.

"నిజమే .... ఊరుకుంటే లాభంలేదు. సరే .... మీరు వెళ్ళిరండి .... గుడ్‌నైట్" వాచీమీదికెళ్ళింది దృష్టి.

సినిమా విడిచే టైమైంది భృకుటి మీద చెమట బిందువులు మెరుస్తున్నాయి. ఏదో ఒక పరిష్కారమార్గంకోసం పరుగెత్తింది ఆలోచన.

"ఏమండీ అలా కూచున్నారు?" విచారంతో కూర్చున్న భర్తను, ఇహలోకంలో పడవేసింది భార్య.

* * * * * * *

ఎంక్వయిరీ ఆఫీసర్ రిపోర్టు ఆధారంగా హెడ్డాఫీసు చర్య తీసుకుంది. "ఆఫీసు క్రమశిక్షణ కాపాడాల్సిన ఆఫీసర్లు మానేజరు, డెప్యూటీమానేజర్లే ఆఫీసులో కొట్లాడు కోవడం, కొట్టు కోవడం సహించరాని నేరం. ఇద్దరిలో ఎవరొక్కరు ఓపికతో ఉండి, హెడ్డాఫీసుకు రిపోర్టు పంపినా ఇంత జరిగేది కాదు"

అది.... రిపోర్టు సారాంశం

అందుకే ఇద్దరికీ కంపల్సరీ రిటైర్మెంటిప్పించ్చారు.

ఆఫీసులో సీనియర్ మోస్ట్ యు. డి సి, సుందరం మానేజర్ హోదాలో–నెక్ట్స సీనియర్ మోస్ట్ యు.డి.సి. భుజంగరావు డెప్యూటి మానేజర్ హోదాలో దర్శనమిచ్చారు. సీనియర్ గుమస్తాలు రాజశేఖరం, కాళిందిరావులను యు డి.సి. ప్రమోషన్ వరించింది ఆ తర్వాత ... మానేజర్ సుందరం డెప్యూటి మానేజర్ భుజంగరావు సలహాతో – రాజేశ్వర్‌గారి కూతుర్ని, శేషావతారంగారి కుమారున్నీ గుమాస్తాలుగా అపాయింట్ చేశారు.

చల్లని సాయంకాలం.... కొత్త పదవుల నలంకరించిన వారంతా – తాము కష్టపడి, వలపన్ని సాధించిన ఘన విజయాలకు చిహ్నంగా పార్టీ అరేంజ్ చేసారు. తమ ప్లాను సక్సెస్ కావడాన్కి ఎవరెవరెలా నటించింది.... సరదాగా చెప్పుకుంటున్నారు పార్టీలో.

కంపల్సరీ రిటైర్మెంటు పుచ్చుకుని.... ముఖ్య అతిథులుగా వచ్చిన మాజీ మానేజరు, డెప్యూటీ మానేజరు గార్ల కేవిధంగా ఏడ్వాలో అర్థంగాక తమనుతామే తిట్టుకున్నారు.

( "కథాంజలి" మాసపత్రిక – డిసెంబర్ 1976 మరియు
జనవరి 1977. సంచికల్లో )

